www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 03 | జూలై | 2025
పేజీలు : 8

## రైతులకు శాపం కానున్న నిర్లక్ష్యం



-నిర్మాణంలో జాప్యానికి బాధ్యులెవరు
-సాగర్ యుటిని పరిశీలించిన రైతు సంఘం నేతలు

2లో

# నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు





-చదువుతోనే పేదరికం దూరం
-గ్రామాలు పచ్చగా, పరిశుభ్రంగా ఉండాలి
-రోడ్లు, డ్రైనేజీ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** నిరుపేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. చదువుతోనే పేదరికం దూరమవుతుందని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించాలని మంత్రి తెలిపారు. బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం మండలం చిమ్మపుడి గ్రామంలో పర్యటించి ఎస్సి కాలనీ నందు రూ. 80 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ

మిగతా 2లో..

## ఇందిరమ్మ ప్రభుత్వంలో ఆగని అభివృద్ధి.. సంక్షేమం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన ఇందిరమ్మ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎక్కడా ఆగడం లేదని, పెద్ద ఎత్తున్న చేపట్టడం జరిగిందని, రెవిన్యూ, గృహ నిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మంరూరల్ మండలంలోని పొన్నెకల్లు, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మండల పరిషత్ కార్యాలయం, ఏదులాపురంలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఎంపీ రామసాయం రఘురారెడ్డితో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...పేదవారి కోరిక తీర్చాలనే ఆలోచనతోనే ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతో పాటు ఆ నాటి ప్రభుత్వం చేసిన కొన్ని మంచి కార్యక్రమాల అమలు చేస్తున్నట్లు తెలిపారు. రూ.12వేల రైతు భరోసా ఇచ్చి, 9రోజుల్లోనే 9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం అన్నారు. ఇంకా ప్రజలకు మంచి చేసే అనేక కార్యక్రమాలను

మిగతా 2లో..

## 42 శాతం రిజర్వేషన్ తర్వాతే స్థానిక ఎన్నికలు




-ధాన్యం కొనుగోలు విషయంలో మంత్రులు ఉన్నా పట్టించుకోలేదు
-హామీలను విస్మరిస్తున్న కాంగ్రెస్
-మీడియా సమావేశంలో ఎంఎల్‌సి కవిత

**ప్రజాపక్షం/ ఖమ్మం :** 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత తెలిపారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్రం మూడు నెలల్లో ఆమోదించాలని ఇందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆమె డిమాండ్ చేశారు. ఇటీవల మరణించిన వైరా మాజీ శాసన సభ్యులు బానోత్ మదన్‌లాల్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ బిసి బిల్లును ఆమోదించేందుకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చే క్రమంలో ఈ నెల 17న రైల్ రోకో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఖమ్మం మీదుగా

మిగతా 2లో..

## రైతన్నల వ(హ)ర్షాతిరేకం





- ఏటి గట్లపై వ్యవసాయ సందడి
- ఊపందుకున్న పనులు
- దుక్కులు, మళ్లు సిద్ధం చేస్తున్న వైనం
- జిల్లాలో 71.02 మి.మీ వర్షపాతం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వర్షం కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురుచూసిన రైతుల మోములు కుంటపోత వానంతో తడిసి ముద్దవుతున్నాయి. మంగళవారం తెల్లవారు ఝాము నుండి మొదలు బుధవారం రాత్రి వరకు ఎడతెలిపిలేకుండా వర్షం కురుస్తుండటంతో రైతుల్లో హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పంట పొలాలన్నీ నీళ్లలో నిండిపోగా రైతన్నలు వ్యవసాయ పనుల్లో బిజిబిజీగా మారారు. చెరువులు, కంటుల, వాంగులు, వంకలు జళ కళను సందరించుకోవడంతో వరుణ దేవుడు కరిణించాడంటూ ఏటిగట్లపై వ్యవసాయ సందడి మొదలుపెట్టారు.

**ఆలస్యమైనా మంచి వానే...**

మంగళ, బుధవారాల్లో కలిపి జిల్లా వ్యాప్తంగా 71.02 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. జూన్ మాసంలో లోటు వర్షపాతం కురవడంతో అదునుదాటుతోందంటూ రైతులు భయపడ్డారు. జూలై మాసం మొదలువుతునే వాన మెండుగా పడుతుండటంతో ఆలస్యమైనా సరేగానీ ఆశించిన స్థాయిలో వర్షం కురుస్తోందంటూ రైతులు, రైతుకూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాగాల 48 గం.లలో సైతం వర్ష సూచన ఉండటంతో వ్యవసాయానికి అనువైన వాతావరణం

మిగతా 2లో..

# నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు

(మొదటిపేజీ తరువాయి)

పనులకు, రూ. 4.95 కోట్లతో చిమ్మపుడి నుంచి పండితాపురం వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు, రూ. 150 కోట్లతో చిమ్మపుడి నుంచి మంచుకొండ వరకు నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ గ్రామాల్లో గుడిసెల్లో ఉండే నిరుపేదలకు మొదటి విడత ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంగన్ వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. వారి ఎదుగుదలను నిరంతరం మానిటరింగ్ చేయాలని, పెండింగ్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. దశల వారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రూ. 12వేల కోట్లతో సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, రూ. 25వేల కోట్లతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రైతు భరోసా క్రింద రూ. 9వేల కోట్లు, రూ. 33 కోట్లు చేనేత రుణమాఫీ చేశామన్నారు. గతంలో చిమ్మపుడి గ్రామానికి రోడ్డు లేదని ప్రస్తుతం మౌలిక వసతుల కల్పన చేపట్టామన్నారు. పిల్లలు చదువుకునేందుకు రఘునాథపాలెం మండల కేంద్రంలో స్వామి నారాయణ స్కూల్, సమీకృత గురుకుల పాఠశాలలు ఏర్పాటవుతున్నాయన్నారు. విద్య ద్వారానే పేదరికం దూరమవుతుందని పిల్లలకు తప్పనిసరిగా చదువు చెప్పించాలన్నారు. బుగ్గవాగు ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు సాగునీటిని అందించేలా కార్యాచరణ చేపట్టామన్నారు. గ్రామాలు పచ్చగా పరిశుభ్రంగా ఉండాలని, అందరూ సంతోషంగా ఆనందంగా ఉండాలన్నారు. సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని తెలిపారు. పేదలకు, రైతులకు భవిష్యత్తులో పిల్లలకు ఏమి కావాలో ఆలోచించి మంచి కార్యక్రమాలు చేపట్టి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరూ సామరస్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, జెడ్పిసిఈవో దీక్షారైనా, ఆర్డీవో జి. నర్సింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, పిఆర్ఎస్ఈ వెంకటరెడ్డి, ఆర్అండ్బి ఈఈ పవార్, రఘునాథపాలెం తహశీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్‌కుమార్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సాధు రమేష్‌రెడ్డి, వాంకుడోత్ దీప్లానాయక్, మారం కరుణాకర్‌రెడ్డి, కోటేరు చిన్ననర్సిరెడ్డి, జోనబోయిన పాపయ్య, గుండ్ల గోవర్ధన్, కన్నం నరేష్, ముద్రబోయిన పుల్లయ్య, పొన్నం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నల వ(హ)ర్షాతిరేకం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పడింది.

**ఊపందుకున్న వ్యవసాయం...**

జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. గత నెల్లో ఆశించిన స్థాయిలో వానలు కురవకపోవడంతో దుక్కులు దున్నుకుని సిద్ధంగా ఉన్న రైతులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా పొలంబాట పట్టారు. జిల్లాలో వానా కాలం సీజన్లో పత్తి 2లక్షల 10 వేల ఎకరాలు,వరి 1 లక్ష 68 వేల ఎకరాలు, మిర్చి 15 వేల ఎకరాలతో పాటు ఇతర పంటలు సాగు అంచనాలను వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. కాగా జూన్ మాసంలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడక పోవడంతో జిల్లా వ్యాప్తంగా కేవలం 1 లక్ష 60వేల ఎకరాల్లో మాత్రమే పత్తివిత్తనాలు విత్తారు. తడిపెట్టేందుకు వీలున్న పొలాల్లో రైతులు పంటను వేశారు. జూలై నెల మొదలు వానలు దండిగా పడుతుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో మునిగితేలుతున్నారు. సాధారణ రకం పత్తికి రూ.7710, ఏగ్రేడ్ పత్తి రకానికి రూ.8110 లను కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచడంతో ఎక్కువ మంది రైతులు అంచనాలకు మించి పత్తి సాగుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంగా వరిమళ్లను సైతం సిద్ధం చేస్తున్నారు. వరి సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరతో పాటు ఎకరాకు రూ.500బోనస్ చెల్లిస్తుండటంతో సన్నాలవైపే ఈ సారి కూడా మొగ్గు చూపుతున్నారు. మొక్కజొన్న, జొన్న, అపరాలు, ఇతర పంటలను వేసేందుకు రైతులు సమాయత్తం అవుతుండగా వ్యవసాయాధికారులు వాతావరణ పరిస్థితులు, నేల స్వభావాన్ని బట్టి సూచనలు సలహాలు ఇస్తూ రైతులను ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : వర్షాకాల సీజన్లో ప్రకృతి విపత్తులు, సీజనల్ వ్యాధులపై మండలస్థాయి గ్రామస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఓ ఎస్కె సిలార్‌సాహెబ్ అన్నారు. గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో వచ్చిన భారీ వర్షాలకు తిరుమలాయపాలెం మండల పరిధిలోని రాకాసి తండాతో పాటు పలు గ్రామాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని అలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులతో దమ్మాయిగూడెం రైతు వేదికలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలస్థాయి గ్రామస్థాయి అధికారులతో పాటు మల్టీపర్పస్ వర్కర్స్, ఆపదమిత్ర సభ్యులలో పాటు హెల్త్, ఆశా వర్కర్లు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రకృతి విపత్తును ముందుగానే పసిగట్టి భారీ వర్షాలకు ప్రభావితం అయ్యే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసి గ్రామాల్లో ఉన్న పశువులను ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. వరదలు విపత్తులు సంభవించినప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 1077కు సంప్రదించాలని, మండల, గ్రామస్థాయి అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి నిత్యం వాతావరణ సమాచారాన్ని గ్రూపులో ఫార్వర్డ్ చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ పి.సూర్యనారాయణ, మండల వ్యవసాయాధికారి సీతారామ రెడ్డి, వైద్యాధికారులు వసుంధర, మహేందర్‌రెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఇంజనీర్ ఖలీల్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్స్, ఇరిగేషన్ శాఖ ఇంజనీర్ రామకృష్ణ, వైద్య సిబబది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామపంచాయతీ మల్టీపర్పస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డుల అభివృద్ధికి కృషి



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మధిర మండలంలోని మార్కెట్ యార్డుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మధిర మార్కెట్ కమిటీ ఛైర్మన్ బండారు నర్సింహారావు అన్నారు. బుధవారం ఎర్రుపాలెం మార్కెట్‌యార్డ్‌ను సందర్శించి యార్డు నిర్వహణ, తదితర అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సూచనల మేరకు మార్కెట్‌యార్డులను అభివృద్ధి చేయటానికి సంబంధిత అధికారులతో అంచనాలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాలు, పలు అభివృద్ధి పనులకు త్వరలోనే శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ నాయకులు, అనుబంధ సంఘ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ప్రభుత్వంలో ఆగని అభివృద్ధి.. సంక్షేమం

(మొదటిపేజీ తరువాయి)

చేయబోతున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తాం అన్నారు. మంచి చేసే ఇందిరమ్మ ప్రభుత్వానికి ప్రజల దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాల ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, ఆర్డీఓ నరసింహారావు, ఏసీపీ తిరుపతిరెడ్డి, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, జిల్లా సమితి సభ్యులు చెరకుపల్లి భాస్కర్, మండల సమితి సభ్యులు దండి రంగారావు, వెంపటి సురేందర్, గణపారపు వీరన్న, వెన్నం భాస్కర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు మద్ది మల్లారెడ్డి, ధరావత్ రామ్మూర్తి నాయక్, మద్ది కిషోర్‌రెడ్డి, అజ్మీర అశోక్‌నాయక్, కేతినేని వేణు, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు తమ్మినేని నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్ తర్వాతే స్థానిక ఎన్నికలు


(మొదటిపేజీ తరువాయి)

ఢిల్లీ వెళ్లే ఒక్క రైలు కూడా కదలకూడదని ఆమె సూచించారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ బిజెపి ప్రభుత్వం బిసి బిల్లును ఆమోదించాలని ఇందుకు బిజెపి నూతన అధ్యక్షుడు రాంచందర్‌రావు చొరవ తీసుకోవాలని ఆమె కోరారు. రైతు భరోసా నిధులు పంపిణీ చేసి ఎన్నికలకు వెళ్తామని ప్రభుత్వం అనుకుంటున్న రైతులు ఎవరు సంతోషంగా లేరన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు రైతులను వేధిస్తే ముగ్గురు మంత్రులున్నా మాట్లాడలేదని ఆమె తెలిపారు. సన్న వడ్ల బోనస్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బోగస్ పథకంగా మార్చిందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిందేనన్నారు. పెన్షన్ల పెంపుదల తదితర హామీలను విస్మరిస్తే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు సహించరన్నారు. మీడియా సమావేశంలో కూరాకుల నాగభూషణం, ఆర్‌జెసి కృష్ణ, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు శాపం కానున్న నిర్లక్ష్యం

ప్రజాపక్షం/ఖమ్మం : అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారనుందని ఇదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే ఆందోళన చేపట్టక తప్పదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు హెచ్చరించారు. అధికారుల తీరు దేవుడు వరమిచ్చినా పూజారి వరమియ్యని చందంగా ఉందని ఆయన తెలిపారు. రైతు సంఘం నేతలు బుధవారం పాలేరు వద్ద యుటిని పరిశీలించారు. గతేడాది సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు పాలేరుకు పెద్ద ఎత్తున వరద రావడంతో సాగర్ కాలువపై వరద పడి పాలేరు వద్ద కాలువ చాలా దూరం కొట్టుకుపోయింది. ఇక్కడ అండర్ టన్నెల్ (యుటి)దెబ్బతిన్నది మరల వ్యవసాయ సీజన్ ప్రారంభమైన ఇక్కడ పనులు పూర్తి చేసి కాలువను పునరుద్ధరించడంలో జాప్యం జరుగుతుండగా ఆ పనులను రైతు సంఘం నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ప్రభుత్వంనిధులు మంజూరుచేసినా అధికారుల అలసత్వం కారణంగా పనులు పూర్తికాలేదన్నారు. ఇప్పుడు శ్రీశైలానికి వరద వస్తుందని ఆ తర్వాత నాగార్జున సాగర్‌కు చేరే అవకాశం ఉందన్నారు. జులై మాసం వచ్చినా పనులు పూర్తి కాకపోవడంతో సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. నాగార్జున సాగర్ ఆయకట్టు క్రింద ఖమ్మంజిల్లాలో 2.50 లక్షల ఎకరాలు సాగవుతుందని గతేడాది కాలువ తెగిన సందర్భంలో నెల రోజుల పాటు నీరు రాక పంటలు దెబ్బతిన్నాయని ఈ ఏడాది అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరు వదిలే పరిస్థితి లేదన్నారు. అధికార యంత్రాంగం రైతుల సాగు నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తక్షణం టన్నెల్ పనులను పూర్తి చేయాలని ఇదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే కార్యాలయాలను ముట్టడించడంతో పాటురైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని గోవిందరావు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, కూచిపూడి రవి, బానోత్ రాంకోటి, యడ్లపల్లి శంకరయ్య, బాగం ప్రసాద్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, భాస్కర్‌రావు, మామిడి సుదర్శన్‌రెడ్డి, పావులూరి మల్లికార్జున్‌రావు, వెన్నం భాస్కర్, పాసంగుల చందర్‌రావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు చివరి తేదీ 7



ప్రజాపక్షం/కల్లూరు: తెలంగాణ ఓపెన్ స్కూల్ 10వ తరగతి ఇంటర్మీడియట్ లో ప్రవేశాలకు గాను విజ్ఞాన్ విద్యాలయం లో ప్రవేశాలు జరుగుతున్నాయని, ఈ నెల ఏడో తేదీ లోపల ప్రవేశాలకు చివరి తేదీ ఏడో తేదీ అని, మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీలో ఉన్న వారు ఈ అవకాశాలను వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ ఇస్మాయిల్ కోరారు. ప్రత్యేకించి విద్యను మధ్యలో నిలుపుదల చేసిన వారు, చదువు మీద ఆసక్తి ఉన్న పాఠశాలకు వెళ్ళలేని వారు, ప్రమోషన్ కోసం వేచి చూసే ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9985835115 సంప్రదించాలని కోరారు.

## నాగాచారికి నివాళి



ప్రజాపక్షం/సత్తుపల్లి: పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్లో దురిశెట్టి శ్రీనివాసరావు, మాధవాచారిల నాన్న నాగాచారి దశదిన ఖర్మ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ హాజరై నాగాచారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దయానంద్ వెంట సత్తుపల్లి ఏఎంసీ ఛైర్మన్ దోమ ఆనంద్ బాబు, సత్తుపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాది చెన్నకేశవరావు, గ్రాండ్ మౌలాలి, కమల్ పాషా, వందనపు సత్యనారాయణ,మానుకోట ప్రసాద్, ఇమ్మనేని ప్రసాద్, సాయిశ్రీను, ఈనూస్‌లతో పాటు సత్తుపల్లి పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాయకులకు క్రమశిక్షణ ముఖ్యం



**-ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**
**-ఖార్గె పర్యటనను విజయవంతం చేయాలి**
**-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాజకీయాల్లో రాణించాలంటే నాయకులకు, కార్యకర్తలకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన పట్టణ, మండల, గ్రామ బూత్ స్థాయి అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, ఖమ్మంజిల్లా ఇంచార్జిలు, టిపిసిసి మాజీ అధ్యక్షులు డా॥ శ్రావణ్ కుమార్‌రెడ్డి, చక్కిలం రాజేశ్వరరావు, దైదా రవీందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏ స్థాయి నాయకుడైనా ప్రజాభిమానం పొందాలంటే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. క్రమశిక్షణ లేకుండా ఏ వ్యవస్థలోనైనా రాణించడం కష్టమన్నారు. రాష్ట్రంలో బిఆర్‌ఎస్ తన మనుగడను కాపాడుకునే ప్రయత్నం చేస్తుందని అందు కోసమే కాంగ్రెస్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలవరం బనకచర్ల ప్రాజెక్టులపై బిఆర్‌ఎస్ చేసే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని సెంటిమెంట్‌తో మరోమారు రాష్ట్రంలో అలజడి సృష్టించాలని చూస్తున్నారని తుమ్మల విమర్శించారు. దేశంలో ఎక్కడలేనివిధంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. రాజ్యాంగ ఆవశ్యకతను మారుమూల గ్రామాల్లోకి చేరవేయడమే లక్ష్యంగా ఆలిండియా కాంగ్రెస్ కమిటీ జై బీమ్ జై బాపు జై సంవిధాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా పార్టీలో కొత్త కార్యవర్గ కమిటీలను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జై బీమ్ జై బాపు జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖార్గె ఈనెల నాలుగున హైదరాబాద్‌లో పర్యటించనున్నారని ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చేలా డివిజన్, బూత్ స్థాయి అధ్యక్షులు కృషి చేయాలని మంత్రి తుమ్మల తెలిపారు. ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా ఇంచార్జీలు శ్రావణ్‌కుమార్ రెడ్డి, రాజేశ్వరరావు, రవీందర్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ జావిద్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మినారాయణ, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్ గౌడ్, ముజాహిద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, బొడ్డు బొందయ్య, యడ్లపల్లి సంతోష్, సాధు రమేష్‌రెడ్డి, మిక్కిలినేని నరేంద్ర, బానాల లక్ష్మణ్, నరాల నరేష్, అబ్బాస్, సొసైటీ ఛైర్మన్ రావూరి సైదబాబు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

**-ఇండ్ల పట్టాలు పంపిణీ చేసిన ఏఎంసి ఛైర్మన్**




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు దశల వారీగా మంజూరు చేస్తుందని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా మొదటి విడతలో 40 మంది లబ్దిదారులకు మంజూరైన ఇండ్ల పట్టాలను మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు ముఖ్య అతిథిగా విచ్చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు మంజూరైన ఇండ్ల పట్టాలను లబ్దిదారులకు అందజేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇండ్లు లేని నిరుపేదలకు ఐదు లక్షలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకం ద్వారా లబ్ది చేకూరుతుందని తెలిపారు. దశల వారీగా ఈ పథకానికి సంబంధించి లబ్దిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు లబ్దిదారులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి నగేష్, డిఈ జగ్రామ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు బానోత్ కిషోర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాపా ఆదినారాయణ, దార మాధవరావు, నాయకులు కిలారు వెంకట రమణ, దరావత్ వీరునాయక్, కుతుంబాక సత్యనారాయణ, రాపర్తి రాజా, తగరం ఆదాం, తగరం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కోదండ రామాలయ వార్షికోత్సవం



**ప్రజాపక్షం/చింతకాని :** తిమ్మినేనిపాలెం గ్రామంలోని కోదండరామాలయ 8వ వార్షికోత్సవం బుధవారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చకులు హర్షవర్ధానాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పైత్తున పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కూచిపుడి బుచ్చిబాబు, దమ్మిలపాటి వెంకటేశ్వర్లు, తుల్లూరు ఫరీద్, కూచిపుడి సురేష్, ఆళ్ల శ్రీనివాసరావు, బద్రి కాశీ, నరేష్ బాబు, షేక్ అబ్దుల్ నబీ, భజన బృందం సభ్యులు చెరుకూరి రాజ్యలక్ష్మి, లీలీవతి, దమ్మాలపాటి రమ, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

## 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/ మధిర :** కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజల డిమాండ్ల సాధన కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష నాయకులు మిరియాల రమణగుప్తా, శీలం నర్సింహారావు, మందడపు రాణి, మల్లాది హన్మంతరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బోడేపూడి భవన్ నందు సిపిఐ నాయకులు బెజవాడ రవిబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలోని పాలకులు పేద, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని అన్నారు. పేదలకు, రైతులకు, కార్మికులకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆ హామీలను నిలబెట్టుకోవటంలో పూర్తిగా వైఫల్యం చెందాయని విమర్శించారు. అఖిపక్షం పిలుపులో భాగంగా నిర్వహించనున్న దేశవాప్త సమ్మెలో భాగంగా ఈ నెల 7న భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. జూలై 9న కార్మికులతో భారీ ప్రదర్శన నిర్వహించి బంద్‌ను విజయవంతం చేసేందుకు అఖిలపక్షం నాయకులు, కార్యకర్తలు, రైతులు, కార్మికులు, ప్రజలు, అనుబంధ సంఘాల నాయకులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మందా సైదులు, మార్నిడి పుల్లయ్య, ఊట్ల కొండలరావు, షేక్.రహీం, పడకంటి మురళీ, పెరుమాళ్ళపల్లి ప్రకాశ్‌రావు, అన్నవరపు సత్యనారాయణ, తేలప్రోలు రాధాకృష్ణ, బండారు నర్సింహారావు, చెరుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ నాయకుల ముందస్తు అరెస్ట్



**ప్రజాపక్షం/చింతకాని :** అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున చింతకాని పోలీసులు ఏఐవైఎఫ్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు అబ్బూరి మహేష్ మండల నాయకులు కనపర్తి సత్యనారాయణ, వడ్డె కిషోర్, కాంపెల్లి రమేష్, తదితరులను చింతకాని పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం స్వంత పూచీకత్తుపై విడుదల చేశారు.ఈ సందర్భంగా అక్రమ అరెస్ట్ లను సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రరెడ్డి, కొండపర్తి గోవిందరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు ఖండించారు.

## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



**ప్రజాపక్షం/ మధిర :** సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మధిర ఎఎస్ఐ లచ్చు అన్నారు. మధిర పట్టణంలోని శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ నందు కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ బి.అంజనబాబు అధ్యక్షతన విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు, సోషల్‌మీడియాలో జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచార గోప్యత, ఫిషింగ్, మల్వేర్‌దాడులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని, పలు జాగ్రత్తలు పాటించటం ద్వారా సైబర్ నేరగాళ్ళ నుండి తప్పించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సిహెచ్.చందు, బి.శ్రీనివాసరావు, ఇతర పోలీస్ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు బీరువా వితరణ



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మండల పరిధి అల్లీనగరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు అదే గ్రామానికి చెందిన సూర్యదేవర వినయ్‌కుమార్ రూ.15వేలు విలువ చేసే బీరువాను వితరణగా అందించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం తెల్లమేకల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారికి అవసరమయ్యే మౌలిక వసతులను కల్పనకు దాతలు ముందుకు రావటం శుభపరిణామమని అన్నారు. పాఠశాలకు బీరువా అందించిన దాత వినయ్‌కుమార్‌కు పాఠశాల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## నాగరాజు మృతి సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/చింతకాని :** సీపిఐ నాయకులు ఆవుల నాగరాజు మృతి పార్టీకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. వందనం గ్రామానికి చెందిన సిపిఐ నాయకులు ఆవుల నాగరాజు బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి వందనం చేరుకొని నాగరాజు మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈసందర్భంగా జమ్ముల మాట్లాడుతూ నాగరాజు వందనం గ్రామంలో పార్టీ ఎదుగుదలకు ఎంతో కృషిచేశాడని బ్రతికినంత కాలం నిబద్ధత గల కమ్యునిస్టుగా బ్రతికాడన్నారు. పార్టీ పిలుపిచ్చిన ప్రతి కార్యక్రమంలో నాగరాజు ముందుండేవారని గుర్తు చేసుకున్నారు. నాగరాజు కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, మండల కౌన్సిల్ సభ్యులు గోగుల ఆది, బోళ్ల మల్లేశ్వరరావు, అమర్లపుడి వెంకన్న సిపిఐ గ్రామ నాయకులు ఆవుల మంగయ్య తదితరులు ఉన్నారు.

## విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య డీలర్లకు సూచించారు. బుధవారం మధిర మండల విత్తన, ఎరువుల దుకాణ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను కృత్రిమ కొరత సృష్టించకుండా తగినంతగా రైతులకు అందించాలని తెలిపారు. డీలర్లందరూ స్టాక్ బోర్డులు, స్టాక్ రిజిస్టర్లు ఎప్పటికప్పుడు నిర్వహించాలని తెలిపారు. నిబంధనలను పాటించని డీలర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియాను పైపాటుగా వాడుకోవాలని రైతులకు తెలిపారు. అనంతరం రాయపట్నం గ్రామంలో పచ్చిరొట్ట వేసిన పొలంను సందర్శించి రైతులతో పచ్చిరొట్ట ఎరువుల ప్రయోజనాలు, ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ విజయచంద్ర, మండల వ్యవసాయాధికారి కె.సాయిదీక్షిత్, ఆత్మ కమిటీ సభ్యులు గోపాలరావు, ఎఈఓలు టి.జిష్ణు, కె.గురుమూర్తి, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకోండి




**- సిపి సునీల్‌దత్**

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అదేశించారు. బుధవారం స్థానిక మహిళపోలీసు స్టేషన్‌ను ఆయన అకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ నిర్వహణ, పెండింగ్‌లో ఉన్న కేసులు, చార్జిషీట్ రికార్డులు, సిడి ఫైళ్లను పరిశీలించి అక్కడి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే మహిళలు, ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా మాట్లాడుతూ వారి సమస్యను తెలుసుకుని సానుకూలంగా స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా వివిద కళాశాలలు, పాఠశాలలలోని విద్యార్థినులతో పాటు మహిళలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను మహిళా పోలీసు సిబ్బంది సందర్శిస్తూ వారికి రక్షణ కల్పించాలన్నారు. అదేవిధంగా మహిళాచట్టాలు, అపద సమయంలో పోలీసుల సహాయం వంటి వాటిపై వారికి అవగాహన కల్పించాలన్నారు.

# ఈఎల్ఐ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**-వరంగల్ ప్రాంతీయ పిఎఫ్ కమిషనర్ శ్రీనివాస్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉపాధి సంబంధిత ప్రోత్సాహక (ఈఎల్ఐ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ ప్రాంతీయ పిఎఫ్ కమిషనర్ వైడి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 99446 కోట్ల ఆర్థిక వ్యయంతో రెండేళ్ల వ్యవధిలో 3.5 కోట్ల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి సంబంధిత ప్రోత్సాహక పథకాన్ని ఆమోదించిందన్నారు. ఇందులో 1.92 కోట్ల మందికి తొలిసారిగా ఉద్యోగంలో ప్రవేశించే లబ్దిదారులు ఉంటారన్నారు. ఉపాధి సంబంధిత ప్రోత్సాహక పథకంలో తొలి సారి ఉద్యోగంలోకి వచ్చేవారికి ప్రోత్సాహకం, యజమానులకు మద్దతు రెండు భాగాలు ఉంటాయన్నారు. తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి సారించి ఈ పథకం అమలు చేస్తామని తెలిపారు. ఈ పథకం యొక్క ప్రయోజనాలు 2025 ఆగస్టు ఒకటి నుంచి 2027 జులై 31 మధ్య సృష్టించబడిన ఉద్యోగాలకు వర్తిస్తాయన్నారు. వ్యవస్థీకృత రంగాల్లో కొత్తగా ఉద్యోగంలోకి వచ్చే వారికి ఒక నెల జీతం (గరిష్టంగా రూ. 15వేలు) రెండు విడతలుగా బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. మొదటి విడత ఆరు నెలల సేవ అనంతరం, రెండవ విడత 12 నెలల సేవ, ఆర్థిక సాక్షరత కార్యక్రమం పూర్తి చేసిన తర్వాత అందిస్తామన్నారు. నెలకు రూ. లక్ష లోపు వేతనం ఉన్న వారికి ఈ పథకం అమలవుతుందని, 1.92 కోట్ల మంది లబ్దిదారులకు ఈ పథకం అమలు చేస్తామన్నారు. యజమానులకు మద్దతు క్రింద అన్ని రంగాల్లో ఉద్యోగాల సృష్టికి ప్రోత్సాహకాలు అందిస్తామని, ముఖ్యంగా తయారీ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రతి కొత్త ఉద్యోగికి యజమానులకు నెలకు రూ. 3వేల ప్రోత్సాహం రెండేళ్ల పాటు అందిస్తామని తెలిపారు. తయారీ రంగానికి ఈ ప్రోత్సాహకాలు మూడు, నాలుగేళ్లకు పోడిగించబడతాయన్నారు. 50 మందికి తక్కువ ఉద్యోగులు ఉన్న సంస్థలు కనీసం రెండు కొత్త ఉద్యోగాలను, 50 కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు కనీసం ఐదు కొత్త ఉద్యోగాలు నియమించి ఆరు నెలల పాటు నిరంతర సేవ చేస్తే ఈ పథకం అమలుకు అర్హులవుతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి సంబంధిత ప్రోత్సాహక పథకం అర్హులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని మరింత సమాచారం కోసం వరంగల్ పిఎఫ్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య కారణాలతో చికిత్సలు పొంది ఆర్థికంగా ఆదుకునేందుకు బాధితుల తరుపున ఎంపి సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బుధవారం గట్టయ్య సెంటర్‌లోని ఎంపి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు తో కలిసి ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి పంపిణీ చేశారు. ఖమ్మం , పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజక వర్గాలకు చెందిన మొత్తం 50 మంది లబ్దిదారులకు రూ. 11.24 లక్షల లబ్ది చేకూరింది. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసానిస్తుందన్నారు. అనారోగ్యంతో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా భరోసా కల్పిస్తుందన్నారు. ఇప్పటి వరకు 1100 మందికి ఈ పథకం ద్వారా లబ్ది చేకూర్చి



నట్లు తెలిపారు. ముందస్తు చికిత్సల కోసం పలువురికి ఎల్‌వోసి పత్రాలు కూడా మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పుల చంద్రశేఖర్, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి గ్రామానికి చెందిన ఎల్లంకి మ్యాగీకి గతంలో అనారోగ్య కారణంతో ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం పొందిన సందర్భంగా ప్రభుత్వం నుండి సీఎం రిలీఫ్ ఫండ్ కొరకు ఎంపీ రఘురాం రెడ్డి దగ్గర దరఖాస్తు చేసుకోగా, బుధవారం ఎంపీ క్యాంప్ కార్యాలయం నందు ప్రభుత్వం నుండి 28వేల రూపాయల చెక్కు అందించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, తొగర శ్రీను, షేక్ మజీద్ పాషా, ఎల్లంకి పిచ్చయ్య పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న శకుని 2.0 నాటకం





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** 40 మంది ఖమ్మం కళాకారులచే ప్రదర్శించిన శకుని 2.0 ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, యూనిట్ థియేటర్ సంయుక్త నిర్వహణలో ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన శకుని 2.0 నాటకం ఎంతగానో ఆకట్టుకుంది. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన డైరెక్టర్, రైటర్, యాక్టింగ్ ట్రైనర్ చిన్న గంతోటి ఆధ్వర్యంలో రెండు నెలలుగా ఆరు సంవత్సరాల నుంచి 65 ఏళ్ల వయస్సు వరకు ఉన్న వారు 40 మంది ఉచిత శిక్షణ పొంది మొట్టమొదటి సారిగా శకుని 2.0 నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకం సినిమా లెవల్‌లో ప్రదర్శించారు. భయానక దృశ్యాలు, యమ ధర్మరాజు ప్రవేశం, బోనాల జాతర, అమ్మవారి ఆగమనం, ముఖ్యంగా కథ ప్రతినాయకుని పాత్ర, చిన్న పిల్లల ఆహార్యం, హాహాభావాలు, సన్నివేశాలు ప్రేక్షకులను మంత్రముగ్దులను చేశాయి. నాటకం చివరి దశలో కళాక్షేత్రంలో పవర్ కట్ అయిన ప్రేక్షకులు తమ మొబైల్ ఫోన్ల లైట్లు వేసుకుని ఆ వెలుగులో లాస్ట్ సీన్ వరకు వీక్షించి నటులను అభినందించడం విశేషం.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ మామిడి హరికృష్ణ, స్థానిక కళా సంస్థ ప్రముఖులు, కళా పోషకులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మదన్‌లాల్ కుటుంబాన్ని పరామర్శించిన కవిత

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇటీవల మృతి చెందిన వైరా మాజీ ఎంఎల్‌ఏ బానోత్ మదన్‌లాల్ కుటుంబాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత పరామర్శించారు. బుధవారం ఖమ్మం నగరంలోని కవిరాజ్ నగర్‌లో గల మదన్‌లాల్ స్వగృహానికి విచ్చేసి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి



వ్యక్తం చేశారు. మదన్‌లాల్ మృతి బిఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటన్నారు.మదన్‌లాల్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు ఆర్‌జెసి కృష్ణ, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మున్నేరు చప్టాపై రాకపోకల మళ్లింపు

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** మున్నేరుకు వరద ప్రవాహం పెరుగుతుండటంతో ఖమ్మం కాల్వ వోడ్డు, నాయుడుపేట మధ్య మున్నేరు చప్టాపై వాహనాల రాకపోకలను నిలిపివేసి దారిమళ్లించినట్లు ట్రాఫిక్ సిఐ బెల్లం సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కురుస్తున్న వర్షాలకు మున్నేరు వాగుకు వరద ఉధృతి పెరుగుతోందని ముందస్తు సంరక్షణ చర్యల్లో భాగంగా వాహనాల రాకపోకలను ప్రకాష్‌నగర్, కరుణగిరి మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు. వరద ప్రవాహం తగ్గిన అనంతరం తిరిగి రాకపోకలు కోనసాగుతాయని నగరవాసులు, వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని విజ్ఞాప్తి చేశారు.

## ఎంపిడిఓ కార్యాలయంలో ఎవరికి వారే..

**- నలుగురు అటెండర్లు ఉన్నా అపరిశుభ్రతతో కార్యాలయం**

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలం విశాలమైన సుదీర్ఘ దూర ప్రాంతాలు కలిగిన 40 గ్రామపంచాయతీల పరిధిలో సుమారు 80వేల జనాభా కలిగిఉంది. మండలస్థాయి అధికారులు ప్రజాప్రతినిధులతో పాటు ప్రభుత్వ సంక్షేమ



పథకాలు అవసరం కోసం మండల కేంద్రంలో ఉన్న మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయానికి నిత్యం వందలసంఖ్యలో ప్రజలు వచ్చి వెళ్తుంటారు. కాని ప్రజా పరిషత్ కార్యాలయం అపరిశుభ్రంగా కార్యాలయం అంతా దుమ్ము దూళితో దర్శనమిస్తుంది. కార్యాలయంలో ఎంపిడిఓ పర్యవేక్షణ లేకపోవడం కిందిస్థాయి సిబ్బంది కార్యాలయాన్ని ఎవరికి వారే యుమునా తీరే లాగా నలుగులు అటెండర్లు ఉన్నా కార్యాలయాన్ని పట్టించుకునే నాధుడే లేదు. గెజిటెడ్ ఆఫీసర్ వచ్చినట్లు వచ్చి కుర్చీల్లో విశ్రాంతి తీసుకుంటూ కాలక్షేపంగా సెల్ఫోన్లో రీల్స్ చూసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. ప్రభుత్వం వేల జీతాలు ప్రజాధానాన్ని అధికారులకు, సిబ్బందికి అందిస్తుంటే ప్రభుత్వ కార్యాలయాలు మాత్రం అపరిశుభ్రతతో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే కార్యాలయాన్ని శుభ్రపర్చి అవసరం లేని అటెండ్లను పలు శాఖల్లో నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

## బదిలీ బ్యాంక్ మేనేజర్‌కు పెన్షనర్ల సత్కారం

**ప్రజాపక్షం/వైరాః** వైరా ఎస్‌బిఐ వైరా శాఖ మేనేజర్ వెంకటరెడ్డి బదిలీపై పాల్వంచ(కిన్నెరసాని) వెళుతున్న సందర్భంగా పెన్షనర్లు మేనేజర్‌ను సత్కరించి శాలువా కప్పి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పైడిపల్లి సత్యనారాయణ, మండల బాధ్యులు సిహెచ్.ఎస్‌వి.ప్రసాద్, జి.సుబ్బ య్య, చల్లా కృష్ణారావు, షేక్ వలీజాన్, సామినేని వెంకటేశ్వరరావు, మిట్టపల్లి పుల్లారావు, ఎస్.పిచ్చిరెడ్డి, జివి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



## కొనసాగుతున్న 100 రోజుల ప్రణాళికా పనులు

**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీలో 100 రోజుల ప్రణాళిక పనుల్లో భాగంగా డ్రైనేజీల్లో పూడిక తొలగింపు, డ్రైనేజీలు ప్రక్కన ఉన్న పిచ్చి మొక్కలు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం వైరా మున్సిపాఇటీ పరిధిలోని 5వ



వార్డు, 11వ వార్డు సోమవరంలో ఈ పనులు కొనసాగాయి. వన మహోత్సవంలో భాగంగా నర్సరీలను పరిశీలించి నర్సరీల వద్ద ఉన్న మొక్కల పెంపకంపై ప్రత్యేక పనులను చేపట్టారు. ఈకార్యక్రమాన్ని మున్సిపాల్ కమీషనర్ చింతా వేణు ఎప్పకటిప్పుడు పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలు చేస్తున్నారు.

## కవి వీరబాబుకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని అనాసాగారం గ్రామానికి చెందిన కవి చిలకబత్తిన వీరబాబు ను మండల కాంగ్రెస్ కమిటి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల కవి సామ్రాట్ అవార్డు అందుకున్న సందర్భంగా స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం లో



సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొర్లకుంట్ల నాగేశ్వరరావు, నాయకులు శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, జెర్రిపోతుల అంజిని, సూరేపల్లి రవి, బచ్చలకూరి నాగరాజు, భద్రయ్య, మదార్, కడియాల నరేష్, కెలాసపు వెంకటేష్, మేకల వెంకటేశ్వర్లు, గరిడేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అరాచక పాలన

**-ప్రజలంతా కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారు**
**-తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో ఆరాచక పాలన సాగుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మండలం లోని అప్పలనరసింహాపురం లో తెలంగాణ జాగృతి నాయకురాలు అనిత తండ్రి నల్లబోతు నరసింహారావు ఇటీవల మృతి చెందాడు. కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఆయన చిత్ర పటంకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాడసానుభూతి ని తెలియచేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్ల తో మాట్లాడారు... తెలంగాణ లో కాంగ్రెస్ హామీలు అమలు చేయటంతో విఫలం కావటంతో ప్రభుత్వం పై వ్యతిరేకత కనిపిస్తుందని అన్నారు. అందుకే ప్రతీ గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ను గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతరువాత 90 మంది కి పైగా విద్యార్థులు చనిపోయారని అన్నారు. కేసీఆర్ పెట్టిన గురుకులాలను చూసుకోలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉందని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో మహిళలకు, చిన్నారులకు రక్షణ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన లో విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట పలువురు పాల్గొన్నారు.

# మీడియా ముసుగులో రెచ్చిపోతే సహించం

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూధన్**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మీడియా ముసుగు లో ఇష్టం వచ్చినట్లుగా రెచ్చిపోయి వ్యక్తి స్వేచ్ఛ ను హరిస్తే...చూస్తు ఊరుకోమని... బరాబర్ గా పదింతలు దాడి చేస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూధన్ హెచ్చరించారు. మండల కేంద్రం లోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం ను నిర్వహించారు. రాష్ట్రంలో కొంత మంది మీడియా ముసుగులో తెలంగాణ ఆత్మగౌరవం ను దెబ్బతీసేలా రేటింగ్ కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. మీడియా విష ప్రచారం వెనక సీఎం రేవంత్ రెడ్డి కుట్ర ఉందని అన్నారు. తీరు మారకపోతే మరింత దాడులు చేయకతప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలకు నమ్మకం పోయిందని అన్నారు. కనీసం పంచాయతీలలో బ్లీచింగ్ చల్లేందుకు డబ్బులు లేక కార్యదర్శులు అప్పులు తీసుకరాలేక.. సెలవులు పెట్టి వెళ్తున్నారని అన్నారు. ట్రాక్టర్ కు డిజీల్ కూడ పోయించలేని దుస్థితిలో రేవంత్రెడ్డి ప్రభుత్వం ఉందని అన్నారు. అధికారం కోసం ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చి అమలు చేయలేక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. మంత్రులు తోపాటు వారి కుటుంబ సభ్యులు మాత్రం కమీషన్ల కోసం దుకాణాలు తెరిచారని అన్నారు. పరిపాలన పూర్తిగా గాడి తప్పిందని అన్నారు. కాగ్ నివేదిక చూస్తే వీరి పాలన అర్థమవుతుందని అన్నారు. కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టు తప్ప...వీరు కొత్తగా తెచ్చిన



ప్రాజెక్టు ఏమీ లేవన్నారు. కనీసం కాలువలలో తట్ట మట్టి కూడ తీయలేదని అన్నారు. రేవంత్రెడ్డి దివాలాకోరు మాటలతో తెలంగాణ పరువుపోతుందని అన్నారు. వ ర్షాకాలం సీజన్ కాబట్టి పారిశుద్ధం కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. కాంగ్రెస్ అధికారం లోకి వచ్చినప్పటీ నుంచి బీఆర్ఎస్ ను విమర్శించటానికే తప్ప... అభివృద్ధి వైపు మళ్లలేదని అన్నారు. తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ను సీఎం గా చేయాలని సిద్ధంగా ఉన్నారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ విలేకర్ల సమావేశంలో మండల అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య, కోటి సైదారెడ్డి, నంబూరి సత్యనారాయణ, మరికంటి రేణుబాబు, తన్నీరుసత్యనారాయణ, కమదన ప్రవీణ్, మాదాసు ఆదాం, సొడేపొంగు ప్రశాంత్, అనగాని నరసింహారావు, యలమంద, దాసరి ఉదయ్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి వరదల పట్ల మండలస్థాయి సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం/పినపాకః** వర్షాకాలం ప్రారంభమైనందున జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గోదావరి వరదలు, స్థానిక వాగుల వలన ముంపునకు గురి అయ్యే ప్రాంతాలలో శాఖల వారీగా తీసుకోవలసిన ముందస్తు చర్యలపై పినపాక మండల కేంద్రంలో ఎంపీడీఓ అధ్యక్షతన సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సునీల్ కుమార్, ఇంచార్జ్ తహశీల్దార్ గోపాల కృష్ణ, ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎంపీవో వెంకటేశ్వర రావు లు మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గోదావరి, పెద్ద వాగు ముంపు ప్రాంతాలలో, కట్టుదిట్టమైన భద్రత చర్యలను చేపట్టాలని, వరదలు పట్ల అప్రమత్తం గా ఉంటూ ఎప్పటికప్పుడు మండల



కేంద్రంలోని కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించాలని, లోతట్టు, ముంపు ప్రాంత నిర్వాసితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటు, వారికి అవసరమైన భోజన వసతులు సిద్ధం చేసుకోవాలని సమావేశంలో సూచించారు. అలాగే ముంపు ప్రాంతాల్లో హెల్త్ క్యాంప్‌ల నిర్వాహణ, శానిటేషన్, తాగునీరు విద్యుత్, సౌకర్యాలు కల్పన, ప్రత్యమ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ముంపు ప్రాంతాల బాధ్యులు ఆయా గ్రామాల్లోనే బస చేయాలని, అక్కడి సమస్యలు, ఇబ్బందులపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లకు సమాచారం ఇచ్చేందుకు సిద్ధంగా వుండాలన్నారు. ఉదాసీనంగా వ్యవహరించే బాధ్యులు, అధికారుల పట్ల చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమం లో అన్ని శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేద విద్యార్థికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/పాల్వంచ :** సిపిఐ పట్టణ కార్యదర్శి, 8 వార్డు మాజీ కౌన్సిలర్ అడుసుమిల్లి సాయిబాబా పేద విద్యార్థిని చదువుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వాన్నిచాటుకున్నారు. పట్టణపరిధిలోని రామ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఎస్‌కే సమీర బాసర ఐఐఐటి లో 3వ సం. చదువుతోంది. ఆర్థిక ఇబ్బందులు



కారణంగా చదువులు ముందుకు సాగే పరిస్థితి లేకపోవడంతో సాయిబాబా బుధవారం తన మిత్రుడు మాచినపల్లి రాము జ్ఞాపకార్థం రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని శేఖర్ బాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్ బాబు మాట్లాడుతూ సాయిబాబా ఎంతోమంది పేద విద్యార్థుల చదువులు ముందుకు సాగేందుకు అనేక సార్లు ఆర్థికంగా సహాయం చేశారన్నారు. పేద విద్యార్థిని సమీర డబ్బులు లేక చదువులు ఆపకూడదనే ఉద్దేశ్యంతో నాలుగేళ్ల చదువు కోసం ప్రతీ ఏటా రూ.10 వేలు ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమని, భవిష్యత్‌లో పేద విద్యార్థుల కోసం మరిన్ని సహాయసహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పాల్వంచ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణ చంద్రరావు, శనగరపు శ్రీనివాసరావు, కొంగర అప్పారావు, దాసరి శంకరయ్య, వనపర్లజకరయ్య, రామడుగు రామాచారి, దనగాలి పద్మ, భాను, దాసరి లక్ష్మి , ఎస్‌కే సైదాబి, హాసనాబి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశముందని, రోడ్లపైకి నీరు చేరే అవకాశం ఉందని, ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని చెప్పారు. సెల్ఫీలు తీసుకునేందుకు పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, నదుల వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని ఆయన సూచించారు. విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రజలు తక్షణమే ఏర్పాటు చేసిన కంట్రలో రూంలకు ఫోన్ చేసి సమాచారాన్ని చేరవేయాలన్నారు. అధికారులు అంతా అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను అంచనాలు వేస్తూ ప్రజలకు సహకరిస్తూ ప్రణాళికాబద్దంగా పనిచేయాలన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజలు అధికారుల చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ సూచించారు. కంట్రోల్ రూం నెంబర్లు : ఐడిఓసి భద్రాద్రి కొత్తగూడెం 087440241950, వాట్సాప్ 9392919747,సబ్ కలెక్టర్ కార్యాలయం, భద్రాచలం 08743232444, వాట్సాప్ 9347910737

# డిడిఆర్ఎఫ్ బృందాలు సిద్ధం : ఎస్పి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వరదల్లో చిక్కుకుని ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు పోలీస్ శాఖ తరుపున డిడిఆర్ఎఫ్ బృంధాలు సిద్ధంగా ఉన్నాయని ఎస్పి రోహిత్ రాజ్ తెలిపారు. వడతెరిపిలేకుండా వర్షాలు పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్లపైకి నీరుచేరే అవకాశం ఉందని, ప్రజలు, వాహన దారులు తగినజాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వర్షాలు, వరదల వల్ల ఇబ్బంది గల ప్రాంతాల్లో పోలీసులు ఇప్పటికే పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వరదలోల్ చిక్కుకుని ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు పోలీస్ శాఖ 24 గం. పాటు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజలు విపత్కర పరిస్థితుల్లో చిక్కుకుంటే 100కి డైయిల్ చేయాలని సూచించారు. సెల్ఫీల మోజులో పడి వాగులు, వంకలు, నదుల వద్ద ప్రమాదాలకు గురికావద్దని ఈ సందర్భంగా ఎస్పి విజ్ఞప్తి చేశారు.

# వర్షాలు కురుస్తున్నా మ్యూజియానికి ఆదరణ తగ్గలేదు : ఐటిడిఏ పిఓ

**ప్రజాపక్షం/భద్రాచలం :** కుండపోతగా వర్షాలు పడుతున్నప్పటికీ ఐటిడిఏలో ఏర్పాటు చేసిన గిరిజన మ్యూజియానికి ఆదరణ తగ్గలేదని, నానాటికీ సందర్శకుల తాకిడి పెరుగుతూనే ఉందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. ట్రైబల్ మ్యూజియానికి వచ్చే సందర్శకుల గురించి మ్యూజియం నిర్వాహకులను



ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ దేవస్థానికివచ్చే భక్తులు మ్యూజియాన్ని సందర్శించే విధంగా ఆటో రిక్షా యూనియన్ల వారితో సమావేశం నిర్వహించి వారికి అవగాహన కల్పించినందున వారి సహకారంతో భక్తులు ఎక్కువగా మ్యూజియం సందర్శిస్తున్నారన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి వచ్చిన పలువురు మహిళలు ఆటోరిక్షా వారి ద్వారా వివరాలు తెలుకునని మ్యూజియాన్ని సందర్శించి పాత తరం గిరిజనులు, పెయింటింగ్ చిత్రాలు, ఇతర కళాకండాలు తనివితీరా చూసి ఆనందం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ ప్రభాకర్రావు, మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి, సిబ్బంది మాధవి, మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్ ప్రారంభం

**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ 202526 విద్యా సంవత్సరం నుండి నూతనంగా తెలంగాణ సార్వత్రిక విద్యా విధానం (ఓపెన్ స్కూల్) ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువుటకు కరకగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రం నుండి ఓపెన్ స్కూల్ ప్రారంభం అడ్మిషన్లు జరుగుతున్నాయని కరకగూడెం మండల తెలంగాణ ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ జి మంజుల బుధవారం వెల్లడించారు. కావున చదువు మధ్యలో ఆపేసి లేదా రెగ్యులర్ గా పాఠశాలలకు వెళ్లలేని



వారికోసం తెలంగాణ సార్వత్రిక విద్యా విధానం ద్వారా చదువుకునే అవకాశాన్ని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ కల్పిస్తున్నాయని, కావున మండలంలోని వివిధ గ్రామాలలో ఓపెన్ స్కూల్/ఇంటర్మీడియట్ విద్యలో ఉత్తీర్ణత పొందుటకు ఉన్నత చదువులకు పదోన్నతులు ఉద్యోగాలలో ప్రభుత్వ గుర్తింపు ఉంటుందని అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఓపెన్ స్కూల్/ఇంటర్మీడియట్ అడ్మిషన్లు పొందుటకు ఈ క్రింది సర్టిఫికెట్ తో పదవ తరగతి చదువుకునేవారు టిసి, బర్త్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు పాస్ ఫోటో, ఇంటర్మీడియట్ చదువుకునే వారు పదవ తరగతి మార్కుల పట్టిక కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ సర్టిఫికెట్ పాస్ ఫోటోలతో తనను సంప్రదించాలని (సెల్ : 9491104082) విజ్ఞప్తి చేశారు.

# జమలాపురంలో వనమహోత్సవం

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతి గా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు కమీషనర్ దేవాదాయ శాఖ హైద్రాబాద్ వారి ఆదేశాల మేరకు బుధవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో మామిడి, రావి, ఉసిరి,



వేప, మారేడు తదితర మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, ఆలయ ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, పర్యవేక్షణాధికారి కె.విజయ కుమారి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు

**-సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాలే మార్గమని పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. మహాసభల్లో భవిష్యత్తు కార్యాచరణను నిర్దేశించుకుని ప్రజా పోరాటాలకు కార్యోన్ముఖులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని దానవాయిగూడెం రామన్నపేట పరిధిలోని 59, 60 డివిజన్ల మహాసభ బుధవారం రామన్నపేటలో జరిగింది. ఈ మహాసభలో సురేష్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితంగానే అనేక హక్కులు సాధించబడ్డాయని ఇప్పుడు అమలవుతున్న సంక్షేమ పథకాల వెనుక కమ్యూనిస్టు పార్టీ నేతల పోరాటాలు, త్యాగాలు ఉన్నాయన్నారు. నాడు భూ పంపిణీ కోసం కమ్యూనిస్టులు పోరాడితే ఇందిరా గాంధీ భూ సంస్కరణల చట్టాన్ని తీసుకు వచ్చిందని బ్యాంకుల జాతీయకరణ కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనని సురేష్ తెలిపారు. 21వ శతాబ్దంలో అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం సహా పలు చట్టాలు కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే ఏర్పడ్డాయన్నారు. కమ్యూనిస్టుల పోరాటం లేనిది కార్మికులకు హక్కులు కానీ పేద, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు కానీ అమలు కాలేదన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ తన మహత్తర పోరాటాలతో అనేక హక్కులు సాధించిందని ప్రజా పోరాటాల క్రమంలో నూరేళ్ళు పూర్తి చేసుకుందన్నారు. శత వసంత సభలతో భారత కమ్యూనిస్టు పార్టీ తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకోబోతుందన్నారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యవర్గ సభ్యులు, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, అజ్మీర రామ్మూర్తి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, త్రీటౌన్ కార్యదర్శి నూనె శశిధర్, సీనియర్ నాయకులు బోజడ్ల సూర్యం తదితరులు పాల్గొన్నారు. ఈ మహాసభకు పీట్ల కృష్ణమూర్తి, గుగులోత్ శ్రీనివాస్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

# జెఎన్‌టియు విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి


**-భవనాలను సత్వరం పూర్తి చేయండి**
**-పొంగులేటికి ఏఐఎస్ఎఫ్ వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణం విషయంలో తీవ్ర జాప్యం జరుగుతుందని వెంటనే పూర్తి చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య డిమాండ్ చేసింది.ఈ మేరకు బుధవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ పాలేరు నియోజక వర్గంలోని మద్దులపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఇంజనీరింగ్ కళాశాలకు పక్కా భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఇదే సమయంలో రెగ్యులర్ ఫ్యాకల్టీ, ల్యాబ్, గ్రంథాలయాలు లేవని రామకృష్ణ తెలిపారు. రెండేళ్ల క్రితం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేయడం జరిగిందని ఐటిడిఏ స్టడీ సర్కిల్ భవనాన్ని కళాశాలకు కేటాయించడం జరిగిందని అందులో ఎటువంటి సౌకర్యాలు లేవన్నారు. సాంకేతిక రంగానికి సంబంధించిన విద్య కావడంతో తప్పనిసరిగా వసతులు సమకూర్చాలని రామకృష్ణ కోరారు. తరగతి గదుల సమస్య కూడా వెంటాడుతుందని చిన్న భవనంలో వందల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. తక్షణం సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ నాయక్, మనోజ్, వంశీ, గోపి తదితరులు పాల్గొన్నారు.

# బ్లడ్ బ్యాంకుల ఆకస్మిక తనిఖీ

**-నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు**
**డిఎంహెచ్‌ఓ బి కళావతిబాయి**





**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** ఖమ్మంలోని శివబ్లడ్ బ్యాంక్, సిరి బ్లడ్ బ్యాంక్, విజయశ్రీ బ్లడ్ బ్యాంక్‌లతో పాటు మమత మెడికల్ కాలేజ్ బ్లడ్ బ్యాంకులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి కళావతిబాయి బుధవారం తమ బృందంతో కలిసి ఆకస్మిక తనిఖీకి చేపట్టారు. నిర్వాహకులకు చెక్ లిస్ట్ ప్రకారం బ్లడ్ బ్యాంకు నిర్వహణ గురించి తెలిపారు. మౌలిక వసతుల నిర్వహణ, భవన పరిశుభ్రంగా ఉండి సక్రమంగా వెలుతురు కలిగి ఉండాలని రక్త సేకరణలో పరీక్షలు, రక్త నిల్వ, దాతల విశ్రాంతి ఏర్పాట్లు, చేతుల శుభ్రంగా పరుచుకోవడానికి నీటి నిర్వహణ, బయో మెడికల్ వ్యర్థాలను డిస్పోస్ విధానం, లైసెన్సు, చట్టబద్ధమైన డ్రగ్ కంట్రోల్ లైసెన్సు(ఫారం 28సి లేదా 28ఈ) కనపడేవిధంగా లైసెన్సులను రిసెప్షన్ కౌంటర్‌లో ఉంచాలని సూచించారు. రక్తదాతల నమోదుల అంగీకార పత్రాలను తీసుకోవాలని తెలిపారు. రక్త సేకరణ, పరీక్ష, రక్త నిల్వ మరియు రక్త ఎవరికి జారీ చేశారో వివరాలను జాగ్రత్త పరచాలని తెలిపారు. రక్తనిల్వ 2 డిగ్రీల సెల్సియస్ నుండి 6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద ఉండాలని, ఉష్ణోగ్రత మానిటరింగ్ మరియు అలారం వ్యవస్థ ఉండాలని, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ పూర్తి రక్తం కోసం వేరు వేరుగా నిల్వ చేసే ప్రాంతాల ఏర్పాటు ఉండాలని మంచి కండిషన్‌లో ఉన్న రక్త బ్యాంకు ఫ్రిజ్, సెంట్రిఫ్యూజ్, హిమోగ్లోబిన్ మీటరు ఉండాలని అవసరమైన స్థాయిలో వైద్య పరికరాలు ఉంచుకోవాలని, బ్లడ్ బ్యాంకు మ్యానువల్ అనుగుణంగా శిక్షణ పొందిన వైద్యులు, టెక్నీషియన్లు, సిబ్బందిని నియమించాలని, వ్యర్థాల నిర్వహణ, బయో మెడికల్ వ్యర్థాలు సక్రమంగా వేరుచేసి నిర్వహించాలని, రిజిష్టర్లు, రికార్డులు 5 సంవత్సరాలు వరకు తప్పనిసరిగా భద్రపరచాలని, ప్రజలకు న్యాయ్యమైన సేవలు అందించాలని, ప్రజల నుంచి కంప్లైయింట్స్ వస్తే ఎంక్వయిరీ చేసి లైసెన్సులను రద్దు చేస్తామని నిరంతరం మానిటరింగ్ చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి బి కళావతిబాబు బ్లడ్ బ్యాంకుల నిర్వాహకులను హెచ్చరించారు. బ్లడ్ బ్యాంకులను తనిఖీ చేసిన వారిలో డిఎంఅండ్‌హెచ్‌ఓ కళావతిబాయితో పాటు డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సైదులు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.

# వీడిన ఉత్కంఠ..!

**-వెలువడిన తుది జాబితా**
**-కల్లూరు మున్సిపాలిటీ వార్డుల ప్రక్రియ పూర్తి**



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు నూతన మున్సిపాలిటీ 20 వార్డులుగా విభజించి ఆమోదం జరిగినట్లు మున్సిపాలిటీ ఇన్చార్జి కమిషనర్ అరిగల సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, రాబోయే రోజుల్లో ఇదే విధంగా మున్సిపాలిటీ ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. కల్లూరు లోని పురపాలక సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్కో వార్డులో 954 ఓటర్ల నుంచి లోపు ఉన్నారని, సరిహద్దులు కూడా నిర్ణయించడం జరిగిందని వారు పేర్కొన్నారు. అభ్యర్థనలు సలహాలు, సూచనలు మేరకు ఈ ప్రక్రియ పూర్తయిందని వివరించారు. మున్సిపాలిటీ మ్యాప్ కూడా తయారు చేయడం జరిగిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఓపెన్ ప్లాట్స్ వారికి నోటీసులు జారీ చేసి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో ఉన్న గ్రామాలలో అవగాహన కార్యక్రమాలను సదస్సులను నిర్వహించడం జరుగుతుందని ప్రజలకు అవగాహన తెలుపుతామని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపాలిటీ మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా ఏఐవైఎఫ్ నేతల అరెస్టు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా అఖిల భారత యువజన సమాఖ్య నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. యుద్ధోన్మాదిగా వ్యవహరిస్తున్న ట్రంప్ వ్యవహార తీరును నిరసిస్తూ అఖిల భారత యువజన సమాఖ్య హైదరాబాద్‌లోని అమెరికన్ రాయబారి కార్యాలయాన్ని ముట్టడించాలని పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లానుంచి ఆందోళన కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న అనేక మంది కార్యకర్తలను పోలీసులు నిర్దాక్షిణ్యంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఏఐవైఎఫ్ రాష్ట్రనాయకులు సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, శ్రావణ్, వెంపటి సురేందర్, వీరభద్రం సహా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నేతలు మాట్లాడుతూ అరెస్టులతో ఆందోళనను ఆపలేరని అమెరికా తన వైఖరిని మార్చుకునేంత వరకు ఏదో ఒక రూపంలో ఆందోళన కొనసాగుతూనే ఉంటుందన్నారు.

# భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/ఏన్కూరు :** మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల అధికారులు కోరారు. మండల పరిధిలోని జన్నారం ,ఆరికాయలపాడు గ్రామాల మధ్యలో గల నిమ్మ వాగు ఉదృతంగా ప్రవహిస్తుండడంతో తహసిల్దార్ శేషగిరిరావు, ఎస్సై ఉఫాతుల్ రఫీ, ఎంపీడీవో జీవీఎస్ నారాయణ పరిశీలించారు. ఆ వాగు వైపు వాహనాలు వెళ్లకుండా ఇరువైపులా ట్రాక్టర్లు అడ్డుగా పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేపల్లెవాడ, జన్నారం, నాచారం వాగుల దగ్గర జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేశారు. గత నాలుగు రోజులు నుండి కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వాగుల వద్దకు పిల్లలను ఈత కొట్టేందుకు వీళ్ళనివద్దని తల్లిదండ్రులకు సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వాగులు, చెరువుల వద్దకు వెళ్ళరాదని వారు కోరారు. రేపల్లెవాడ వాగులో చెత్తాచెదారం ఆగి ఉండటంతో జెసిబి సహాయంతో చెత్తను తొలగించి నీళ్లు వెళ్లే విధంగా చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, పోలీస్ సిబ్బంది రవి ఉన్నారు.

# సింగభూపాలెం చెరువుకు జలకళ



**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువు జలకళ సంతరించుకుంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సుమారు 12 అడుగుల నీరు చేరింది. చెరువు ఆయకట్టు 2,00,400 ఎకరాలలో రైతులు పంట సాగు చేస్తారు. చెరువు మీద ఆధారపడి ప్రధాన పంటగా వరి సాగు చేస్తున్నారు. దానితోపాటు మొక్కజొన్న, కూరగాయలు, పంటలు సాగవుతున్నాయి. ఇప్పటికే కొంతమంది రైతులు తమ వరి నారుమళ్ళు సిద్ధం చేసుకుని వరి నాట్లు వేస్తున్నారు. ఎడమ, కుడి కాలువ ద్వారా సింగభూపాలెం, పాత అంజనాపురం, కొత్త అంజనాపురం , రూప్ల తండా, నరసింహసాగర్, సుజాతనగర్, మంగపేట, గొల్లగూడెం, నాయకులగూడెం, దేగలమడుగు గ్రామాల రైతులు చెరువు నీటి ద్వారా కాలువలు బోర్లు ద్వారా పంటలు సాగు చేస్తున్నారు. వర్షాలు ఏడాది సమృద్ధిగా రావడంతో చెరువుకు అలుగు పారుతుందని, తమ యాసంగి పంటలకు నీరు అందుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఆనందంలో ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీలలో ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులు ఆనందంలో ఉన్నారు. మండల పరిధిలోని లోకవరం, కల్లూరు, చెన్నూరు, పెద్ద కోరుకొండి, వెన్నవల్లి, చిన్న కోరుకొండి, పేరు వంచ, బత్తులపల్లి, చంద్రు పట్ల తదితర గ్రామాలలో ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులు 746 మంది కి మంజూరు కాగా 724 మందికి పట్టాలు అందించడం జరిగిందని, 509 మంది ముగ్గు పోసుకున్నారని, 156 మంది బేస్మెంట్ స్థాయిలో ఉన్నారని, 9 మంది స్లాబ్ స్థాయిలో నిర్మించారని రెండు గృహాలు పూర్తయినట్లు గృహ నిర్మాణ శాఖ అధికారి పవన్ పేర్కొన్నారు. త్వరలో గృహాలు పూర్తి చేసేందుకు లబ్ధిదారులతో అవగాహన సదస్సులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి సోమవారం పలు దశల్లో ఉన్న గృహాలను గృహాలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పలు గ్రామాలలో లబ్ధిదారులు సంతోషంగా ఉల్లాసంగా గృహ నిర్మాణాలను పూర్తి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రత్యేకంగా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన లోకవరం లో 57 గృహాలు మంజూరు కాగా పలు దశల్లో ఉన్నాయని 9 గృహాలు స్లాబ్ స్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. వారు సంతోషంగా ఈ నిర్మాణాలను పూర్తి చేస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ అధికారి పవన్ తో పాటు, ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ కమిటీలు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గ్రామాలలో లబ్ధిదారులు స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానందకు రుణపడి ఉంటామని వారు వివరిస్తున్నారు.